క్లుప్తంగా

ఆకుల శ్రీనివాస్‌కు వెలంపల్లి పరామర్శ



భవానీపురం(విజయవాడపశ్చిమ): పుత్ర వియోగంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు, కాపు నేత ఆకుల శ్రీనివాస్‌కుమార్‌ను బుధవారం పలువురు పరామర్శించారు. భవానీపురంలోని శ్రీనివాస్‌కుమార్ ఇంటికి వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యులు, పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెలంపల్లి శ్రీనివాస్, కేంద్ర మాజీమంత్రి పళ్లంరాజు, పీసీసీ మాజీ అధ్యక్షులు ఎన్. రఘువీరారెడ్డి, కొలనుకొండ శివాజీ, నరహరిశెట్టి నరసింహారావు, మారంరెడ్డి వెంగళరెడ్డి తదితరులు వెళ్లి ఆయనను పరామర్శించారు. ఇటీవల మృతిచెందిన శ్రీనివాస్‌కుమార్ కుమారుడు డాక్టర్ రాజ్‌కుమార్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. శ్రీనివాస్‌కుమార్‌ను పరామర్శించి ఆయన కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

దుర్గమ్మ సేవలో ఎస్టీ కమిషన్ ఛైర్మన్



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను బుధవారం రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకర్‌రావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన శంకర్‌రావుకు అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. శంకరరావు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. ఆలయ అధికారులు ఆయనకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, ఖడ్గమాల వస్త్రాలను అందజేశారు.

అలరించిన వీణగాన కచేరి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో బుధవారం వీణగాన కచేరి భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. విజయవాడకు చెందిన అచలా శంకర్‌నాథ్ పలు కీర్తనలకు వీణపై చక్కగా పలికించగా, మృదంగంపై విద్యాసాగర్, ఘటంపై శ్రీధర్ ఆచార్య చక్కటి సహకారం అందించారు. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై నిర్వహించిన కార్యక్రమానికి ఆలయ అర్చకులు చెరువు ఆదినారాయణ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. కార్యక్రమం అనంతరం వీణ కచేరి నిర్వహించిన బృందానికి ఆలయ డీఈవో రత్నరాజు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

సహస్ర లింగార్చనలో విశేషాలంకరణ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కార్తిక మాసాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరస్వామివారి సన్నిధిలో బుధవారం సహస్ర లింగార్చన పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో కళ్యాణ వేదిక వద్ద ఆలయ అర్చకులు సహస్ర లింగాలకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించిన అనంతరం స్వామివారిని విశేషంగా అలంకరించారు. సాయంత్రం స్వామివారికి పంచహారతుల సేవ, అనంతరం ఆకాశ దీపం, శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు సహస్ర దీపాలంకరణసేవ, ఊంజల్ సేవ నిర్వహించారు. సేవలో పలువురు ఉభయదాతలు, భక్తులు సేవలో పాల్గొన్నారు.

38వ డివిజన్‌లో రోడ్లకు మరమ్మతులు



భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం 38వ డివిజన్‌లోని 159, 194 సచివాలయాల పరిధిలోగల ఇట్టే వారి వీధి, కొట్టేటి కోటయ్య వీధి, రావిచెట్టు సెంటర్‌లోని యూపీహెచ్‌సీ హెల్త్ సెంటర్ పక్కనున్న రోడ్డు గుంతల పూడ్చివేతతోపాటు ప్యాచ్‌వర్క్‌లు చేశారు. ఆయా పనులను వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు షేక్ హయాత్ షరీఫ్ పర్యవేక్షించారు. డివిజన్‌లోని పలు ప్రదేశాల్లో ప్రమాదకరమైన గుంతలు ఉండటంతో ఇబ్బందులు పడుతున్నట్లు ప్రజలు తమ సమస్యను కార్పొరేటర్ రెహమతున్నీసా దృష్టికి తీసుకువెళ్లగా, సంబంధిత అధికారులతో మాట్లాడి రూ.5లక్షల వ్యయంతో మరమ్మతులు చేపట్టినట్లు హయాత్‌షరీఫ్ తెలిపారు.

తాగునీటికి కటకట

- వైఎస్సార్ కాలనీలో వాడుక నీటికి అవస్థలే
- కాలనీవాసుల అవసరాలు తీర్చలేకపోతున్న రిజర్వాయర్
- శిలాఫలకానికే పరిమితమైన మరో రిజర్వాయర్ పనులు
- సమస్యను పరిష్కరించాలని కాలనీవాసుల డిమాండ్



జక్కంపూడి వైఎస్సార్ కాలనీ

భవానీపురం(విజయవాడపశ్చిమ): జక్కంపూడి వైఎస్సార్ కాలనీ వాసులు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాడుక అవసరాలకు సైతం చాలీచాలని నీటితో ఇబ్బందిపడుతున్నారు. కాలనీ ఏర్పాటు చేసి దశాబ్ద కాలం గడిచినా ఇక్కడి ప్రజలు నేటికీ మంచినీళ్ల కోసం అల్లాడుతున్నారంటే నగరపాలక సంస్థ అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. దీంతో మినరల్ వాటర్ క్యాన్లను కొనుగోలు చేయక తప్పడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

ట్యాంకర్ల నీరే దిక్కు..

ఇక్కడ నీటి అవసరాలను తీర్చేందుకు నగరపాలక సంస్థ రోజూ నాలుగు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తోంది. రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు నాలుగు వాటర్ ట్యాంకర్లు తిరుగుతూనే ఉంటాయి. ప్రతి బ్లాకులో ఉన్న వాటర్ సంప్‌లోకి ఆ నీటిని పోస్తారు. ఒక్కో సంప్ నిండాలంటే కనీసం రెండున్నర ట్యాంకర్ల నీరు అవసరం అవుతుంది.

సంప్ నిండిన తరువాత మోటారు వేస్తే పైఅంతస్తులోని ఓవర్‌హెడ్ ట్యాంకుల్లోకి నీరు వెళ్తాయి. ఆ నీటిని బ్లాకులో ఉండే 32 ఫ్లాట్లలో నివసించే వారు వాడుకోవాల్సి ఉంటుంది. మోటారు వేసినప్పుడు వచ్చే కరెంట్ బిల్లు ఆయా ఫ్లాట్లలో ఉండేవారు చెల్లిస్తున్నారు. వాస్తవానికి ట్యాంకర్ల ద్వారా వచ్చేవి మంచినీరే అయినా సంప్‌లోకి వచ్చేసరికి తాగేందుకు పనికిరావు. అదే విధంగా ప్రస్తుతం ఉన్న రిజర్వాయర్ నుంచి కూడా సంప్‌ల్లోకి నీటిని పంపింగ్ చేస్తున్నారు. కాని సరిపడినంత నీరు అందుబాటులో లేకపోతుండటంతో కాలనీవాసులు అవస్థలుపడుతున్నారు. ఇక తాగేందుకు మాత్రం మినరల్ వాటర్ ప్లాంట్ల నుంచి క్యాన్లు కొనుగోలు చేయాల్సిందే.

శిలాఫలకానికే పరిమితమైన పనులు..



కాలనీలో మరో రిజర్వాయర్ నిర్మాణానికి దేవినేని ఉమా వేసిన శిలాఫలకం

కాలనీవాసుల నీటి కొరత తీర్చేందుకు ప్రధాన మౌలిక వసతుల అభివృద్ధి ప్రణాళిక (సీఐఐపీ) నిధులు రూ.52.4కోట్ల వ్యయంతో 1500 కెఎల్ సామర్థ్యంతో రెండో రిజర్వాయర్ నిర్మిస్తానని 2019లో జలవనరులశాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు శంకుస్థాపన చేశారు. అయితే పనులు మాత్రం శిలాఫలకానికే పరిమితమయ్యాయి. కేవలం ఎన్నికల్లో ఓట్లు దండుకునేందుకే ఈ హడావుడిగా శంకుస్థాపన చేశారని కాలనీవాసులు విమర్శిస్తున్నారు. ఇకనైనా కూటమి ప్రభుత్వం స్పందించి తమ మంచినీటి ఇక్కట్లను తీర్చాలని జక్కంపూడి వైఎస్సార్ కాలనీవాసులు కోరుతున్నారు.

అంతటికీ ఒకటే రిజర్వాయర్..

వైఎస్సార్‌కాలనీలో మొత్తం 280 బ్లాక్‌లు ఉండగా, ఒక్కో బ్లాక్‌లో 32ఫ్లాట్లు ఉన్నాయి. ఇక్కడ సుమారు 35వేల మంది జనాభా నివసిస్తున్నారు. కాలనీ అంతటికి కలిపి 1500 కెఎల్ సామర్థ్యంతో కూడిన ఒక రిజర్వాయర్ మాత్రమే ఉంది. ఇది కాలనీకి ఒకవైపు ఉండగా ఆవైపు ఉండే బ్లాకుల్లోని ప్రజలకు మాత్రమే వాడకం నీరు అందుతుంది. ఇక కాలనీకి మరోవైపు బ్లాకుల్లో నివసించే ప్రజలు నీటి ట్యాంకర్ల కోసం ఎదురు చూపులు చూడాల్సిన దుస్థితి నెలకొంది. ఇక్కడ ఆయా బ్లాక్‌లలో 20బోర్లు ఉండగా, వాడుక నీటికోసం కాలనీవాసులు ఈ బోర్లపై ఆధారపడక తప్పడం లేదు.



కాలనీలో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకు

శాశ్వత పరిష్కారం కావాలి..



కాలనీలో ఉండే అధికశాతం మంది పొద్దున లేస్తే కూలి పనులు, చిరుద్యోగాలు చేసుకునేందుకు వెళ్లిపోయేవారే. పనికి వెళ్లే ముందు ప్లాంట్‌కు వెళ్లి మినరల్ వాటర్ క్యాన్లు తెచ్చుకునేందుకు ఇబ్బంది పడుతున్నాం. ఇంటికి చుట్టాలు వచ్చినా, ఫంక్షన్లు ఉన్నా నీటిసమస్య గురించి చెప్పే పనిలేదు. కాలనీలో రెండో రిజర్వాయర్ నిర్మిస్తామంటూ అప్పటి మంత్రి దేవినేని ఉమా శంకుస్థాపన చేసినా పనులు మాత్రం చేపట్టలేదు.

– కొరగంజి సత్యనారాయణ, 9వ సెగ్మెంట్ ఎంపీటీసీ

గుక్కెడు నీళ్ల కోసం అవస్థలు..



ఇంటికి ఎవరైనా వస్తే గుక్కెడు మంచినీళ్లు ఇవ్వలేని దుస్థితి నెలకొంది. వాడకం నీటికే అనేక ఇబ్బందులుపడుతున్నాం. సంప్‌లో నీళ్లు కూడా 32 ఫ్లాట్లలో నివసించే వారికి పూర్తిస్థాయిలో సరిపోవు. అయినా సర్దుకు పోతున్నాం. తిన్నా తినకపోయినా మంచినీళ్లయినా ఉండాలి కదా. ఎవరూ పట్టించుకోకపోతే మా గతేంటి?. ప్రభుత్వం స్పందించి మంచినీటి సమస్యను పరిష్కరించాలి.

– నక్కా ప్రభుదాస్, కాలనీవాసి.

బస్టాండ్‌లో 73 సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్

బస్టాండ్(విజయవాడ పశ్చిమ): పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్‌లో బ్లేడ్ బ్యాచ్ ఆగడాలపై 'సాక్షి' దిన పత్రికలో బుధవారం ప్రచురితమైన 'బ్లేడ్ బ్యాచ్‌కు అడ్డా..నెహ్రూ బస్‌స్టేషన్' కథనానికి ఆర్టీసీ అధికారులు స్పందించారు. బస్టాండ్‌లో 73 సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేసినట్లు డెప్యూటీ ట్రాఫిక్ మేనేజర్ ఎన్.శ్రీనివాసరావు తెలిపారు. ప్రతి రోజూ ఇద్దరు ట్రాఫిక్ సూపర్‌వైజర్లు, ఇద్దరు ఆర్టీసీ కానిస్టేబుళ్లు అవుట్ పోస్ట్ పోలీస్ సిబ్బందితో కలిసి ఒక టీమ్‌ను ఏర్పాటు చేసి నిరంతరం నిఘా ఏర్పాటు చేశామన్నారు. బస్టాండ్‌లో ప్రతి రెండు గంటలకు ఒకసారి తిరిగి అపరిచితులు (ప్రయాణికులను మినహాయించి) కనిపిస్తే వారి వద్దనుంచి వివరాలు తీసుకుని అవసరమైన వారికి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించటంతో పాటు అనుమానిత వ్యక్తులను కృష్ణలంక పోలీస్ సిబ్బందితో విచారించే చర్యలు చేపట్టినట్లు తెలిపారు. విధుల్లో ఉన్న ఆర్టీసీ సిబ్బందిపై ఎటువంటి దాడులు జరగకుండా గట్టి చర్యలు తీసుకున్నామన్నారు. ప్రయాణికులు, సిబ్బందిపై దాడులకు పాల్పడిన వారిపై పోలీసులు గట్టి చర్యలు తీసుకుంటారని తెలిపారు. ప్రయాణికులు ఎటువంటి భయాందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): కబేళా సబ్‌స్టేషన్‌ని 11కేవీ విద్యాధరపురం ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా గురువారం మూడుగంటలపాటు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ ఈఈ పి.రవీంద్రబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని బాలజీకాలనీ, మోడరన్ మ్యాక్స్ ఏరియా, లేబర్‌కాలనీ, చెరువు సెంటర్, మర్రి చెట్టు సెంటర్, నారిండివారి వీధి, రాజుల బజార్, కొండబడి ఏరియా, చిన్న సాయిబాబాగుడి కొండ ఏరియా ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని వివరించారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఈఈ కోరారు.

ఫుడ్‌కోర్ట్ ఏర్పాటుపై ఆందోళన

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం సితార జంక్షన్ సమీపంలో ఫుడ్ కోర్ట్ ఏర్పాటు చేయాలన్న ఆలోచనను నగరపాలక సంస్థ అధికారులు విరమించుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మిథిలానగర్, బాలాజీ కాలనీ నివాసితులు బుధవారం సితార జంక్షన్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు పరిమి మల్లేశ్వరరావు, కటకం రామలింగేశ్వరరావు మాట్లాడుతూ ఇప్పటికే బైపాస్ రోడ్‌పై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇప్పుడు ఈ ప్రాంతంలో ఫుడ్ కోర్ట్ ఏర్పాటు చేస్తే రోడ్డు ప్రమాదాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఫుడ్ కోర్ట్ ఏర్పాటు ప్రతిపాదనను విరమించుకోవాలని కోరారు. ఆందోళనలో రాంపిళ్ల వెంకటరమణ, బాలాజీ కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు రమేష్, అల్లు మధు, మల్లంపాటు కొండలరావు, దేవరపు సూర్యనారాయణ, బోనం వెంకటయ్య, రావెళ్ల నాగేశ్వరరావు, సామా వెంకటస్వామి, కె విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మరుపిళ్ల చిట్టి జయంతి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు, పశ్చిమ నియోజకవర్గ మాజీఎమ్మెల్యే సర్దార్ మరుపిళ్ళ చిట్టి 127వ జయంతి వేడుకలను బుధవారం చిట్టినగర్ సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. పోతిన పైడిరావు ఆధ్వర్యంలో చిట్టినగర్ జంక్షన్‌లోని చిట్టి కాంస్య విగ్రహానికి ఆయాపార్టీలకు చెందిన నేతలు పూలమాల వేసి నివాళులర్పించారు. చిట్టికి నివాళులర్పించిన వారిలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు పోతిన మహేష్, బీజేపీ నాయకులు అడ్డూరి శ్రీరామ్, టీడీపీ నాయకులు ఎంఎస్.బేగ్, చిట్టి మనవడు గుజ్జారి అమర్ తదితరులు ఉన్నారు. ఈసందర్భంగా మాజీఎమ్మెల్యే చిట్టి సేవలను నేతలు గుర్తు చేసుకున్నారు. అనంతరం విగ్రహం వద్ద కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు.

ఏపీ నగరాల సంఘం ఆధ్వర్యంలో...

ఏపీ నగరాల సంఘం ఆధ్వర్యంలో సర్దార్ మరుపిళ్ళ చిట్టి విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘ అధ్యక్షులు ఎన్వీ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సంఘ జనరల్ సెక్రటరీ బాయన శేఖర్‌బాబు, పిళ్లా శ్రీనివాసరావు, శీరం వెంకట్రావు, ఎస్‌ఎస్‌ఆర్, రాంపిళ్ల వాసు, డి. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



చిట్టి విగ్రహానికి నివాళులర్పిస్తున్న వివిధ పార్టీల నేతలు

సమర్థ పారిశుద్ధ్య విధానాన్ని అవలంబించాలి

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరంలో ప్రతినిత్యం సమర్థమైన పారిశుద్ధ్య విధానాన్ని అవలంబించాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. నగర పర్యటనలో భాగంగా ఆయన బుధవారం సత్యనారాయణపురం, సింగ్‌నగర్, ఎక్సెల్ ప్లాంట్, బీసెంట్ రోడ్, పరిసర ప్రాంతాలన్నీ పర్యటించి క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో పారిశుద్ధ్య నిర్వహణలో ఎటువంటి లోపం లేకుండా ఉండాలని, క్లీన్ ఆంధ్రప్రదేశ్(క్లాప్) వాహనాల డ్రైవర్లు సమ్మె చేస్తున్నందున ఇంటింటి చెత్త సేకరణలో, సేకరించిన చెత్త తరలింపులో నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని, వ్యర్థాల తరలింపునకు ట్రాక్టర్ల సంఖ్యను మరింత పెంచి సమర్థమైన పారిశుద్ధ్య నిర్వహణ చేయాలని ప్రజారోగ్యం విభాగం అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ ఇన్‌చార్జి డాక్టర్ సురేష్ బాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెహికల్ డిపో ఇన్‌చార్జి ఏసుపాదం పాల్గొన్నారు.



ప్రజారోగ్య విభాగం అధికారులను సూచనలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

ప్రజలకు న్యాయం జరుగుతుందనే నమ్మకం కల్పించాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది క్రమశిక్షణతో పనిచేసి కలెక్టరేట్ గౌరవం పెంచాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ సూచించారు. కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో బుధవారం కలెక్టరేట్‌లోని సమన్వయ, మెజిస్టీరియల్, ఎలక్షన్స్, ల్యాండ్ తదితర సెక్షన్ల అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉన్నతాధికారులు సూచనలు, క్షేత్రస్థాయిలో ప్రజల అవసరాలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలన్నారు. కలెక్టరేట్‌కు వెళితే తమకు తప్పకుండా న్యాయం జరుగుతుందనే నమ్మకం కల్పించాలన్నారు. ఆ మేరకు సిబ్బంది పనిచేయాలన్నారు. పని ఎంత చిన్నదైనా, పెద్దదైనా సమాన ప్రాధాన్యమిచ్చి సత్వరం పూర్తిచేయాలన్నారు. విధి నిర్వహణలో ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం అనేది ఉండకూడదని కలెక్టర్ లక్ష్మీశ స్పష్టం చేశారు. సమావేశంలో డీఆర్‌వో ఎం.లక్ష్మీ నరసింహం, కలెక్టరేట్ ఏవో ఎస్.శ్రీనివాసరెడ్డి, వివిధ సెక్షన్ల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కౌన్సిల్ అజెండాపై మేయర్ సమీక్ష

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ మేయర్ రాయన భాగ్యలక్ష్మి బుధవారం శాఖాధిపతులతో కౌన్సిల్ అజెండాపై ప్రధాన కార్యాలయంలోని తన చాంబర్ లో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో కౌన్సిల్ అజెండా, అదనపు అజెండాలో ఉన్న ప్రతి ప్రతిపాదనను శాఖాధిపతులతో చర్చించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం సభ్యులు ఇచ్చిన ప్రతిపాదనలకు అధికారులందరూ సహకరించాలని, ప్రజల కోసం విజయవాడ నగరపాలక సంస్థ ఎల్లప్పుడూ తోడుగా ఉండాలని అన్నారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ డి.చంద్రశేఖర్, చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథరెడ్డి, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) సృజన, సూపరింటెండెంట్ ఇంజినీర్లు సత్యనారాయణ, సత్య కుమారి, అకౌంట్స్ ఎగ్జామినర్ చక్రవర్తి, సెక్రటరీ వసంత లక్ష్మి, ఎస్టేట్ ఆఫీసర్ శ్రీనివాస్, డెప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న వీఎంసీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి

సద్గురువులకు స్వర నీరాజనం

విజయవాడ కల్చరల్: శ్రీ సద్గురు సంగీత సభ ఆధ్వర్యంలో దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రం విద్యాభారతి శ్రవణ సదనంలో నిర్వహిస్తున్న 31 వ వార్షిక సంగీతోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. బుధవారం నాటి కార్యక్రమంలో అంతర్జాతీయ కర్నాటక సంగీత విద్వాంసులు, సంగీత ప్రయోక్త విఘ్నేష్ ఈశ్వర్ నిర్వహించిన కచేరీ మధురంగా సాగింది. త్యాగరాజ స్వామి కృతి జగదానందకారక కీర్తనతో ప్రారంభించి, వందే వాసుదేవంతో పాటు పలు సంప్రదాయ కీర్తనలను ఆలపించారు. వయోలిన్‌పై కేవీ కృష్ణ, మృదంగంపై కె.సద్గురు చరణ్, ఘటంపై ఎం.చంద్రకాంత్ సహకరించారు. శ్రీ సద్గురు సంగీత సభ ప్రధాన కార్యదర్శి పోపూరి గౌరీనాథ్ మాట్లాడుతూ సంగీత సభ ద్వారా 31 సంగీత కార్యక్రమాలు నిర్వహిస్తునట్లు తెలిపారు. కచేరీ నిర్వహిస్తున్న విఘ్నేష్ ఈశ్వర్ సంగీత విశేషాలను వివరించారు. సభా కార్యక్రమంలో సంగీత రంగానికి చెందిన విద్యార్థినీ విద్యార్థులకు నగదు అందజేస్తున్నట్లు తెలిపారు. సంస్థ అధ్యక్షుడు బీవీఎస్ ప్రకాష్, సభ్యులు గాయత్రీ గౌరీనాథ్, బి.హరిప్రసాద్ పాల్గొన్నారు. సంగీత విద్వాంసులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. నేటి కార్యక్రమాలు: సాయంత్రం 6.30 గంటలకు హేరంబ్, హేమంత్ వేణునాదన. ప్రవేశం ఉచితం.



గాత్ర కచేరీ చేస్తున్న విఘ్నేశ్ ఈశ్వర్

దర్శకేంద్రుడు రాఘవేంద్రుడు

విజయవాడకల్చరల్: తెలుగు సినీ దర్శకులలో దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు అని మహానటి సావిత్రి కళాపీఠం వ్యవస్థాపకురాలు పరుచూరి విజయలక్ష్మి అన్నారు. మహానటి సావిత్రి సాహిత్య కళాపీఠం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో బుధవారం సినీ దర్శకుడు రాఘవేంద్రరావు దర్శకత్వం వహించిన సినీ చిత్రగీతాలు, గాయనీ గాయకులకు సత్కార కార్యక్రమం నిర్వహించారు. విజయలక్ష్మి మాట్లాడుతూ రాఘవేంద్రరావు 75 చిత్రాలకు దర్శకత్వం వహించి, అనేకమంది నటీ నటులను తెలుగు తెరకు పరిచయం చేసినట్లు తెలిపారు. వివిధ రంగాల ప్రతినిధులు వద్దాది కామేశ్వరి, ప్రభల శ్రీనివాస్, ఎంఎస్ నారాయణ, కె.డేవిడ్ రాజు, డి.వీరబద్రరావు, కొప్పుల ఆనంద్, చావా నరసింహారావు, ప్రసూనా రామన్ తదితరులు రాఘవేంద్రరావు జీవిత విశేషాలను వివరించారు. అనంతరం రాఘవేంద్రరావు దర్శకత్వం వహించిన చిత్రాలలోని పాటలను గాయనీ గాయకులు సుశీల్‌కుమార్, పి.శ్రీనివాసరావు, అయ్యప్పన్, కిరణ్, స్వాతి మీరాకుమార్, బెల్లంకొండ భారతి, ఉమామహేశ్వరి ఆలపించారు. నిర్వాహకులు గాయనీ గాయకులను ఆత్మీయంగా సత్కరించారు.




దర్శకుడు రాఘవేంద్రరావు చిత్రగీతాల కార్యక్రమంలో మాట్లాడుతున్న పరుచూరి విజయలక్ష్మి

యువతకు ఉచిత శిక్షణ అభినందనీయం

బీఐఆర్‌ఈడీ డైరెక్టర్ ఈ.నాగరాజకుమార్

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు వరద ముంపు ప్రాంతంలోని యువత ఆర్థిక అభ్యున్నతికి తోడ్పడాలనే ఆకాంక్షతో బీఐఆర్‌ఈడీ (బ్యాంకర్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్, ఎంట్రప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్), శ్రీసత్యసాయి సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో పలు రంగాల్లో ఉచిత శిక్షణ ఇవ్వడం అభినందనీయమని బీఐఆర్‌ఈడీ డైరెక్టర్ ఇ.నాగరాజకుమార్ అన్నారు. సింగ్‌నగర్, పాయకాపురం, రాజీవ్‌నగర్ పరిసర ప్రాంతాల్లోని 41 మంది యువతకు శ్రీసత్యసాయిసేవా సమితి, బ్యాంకర్ల గ్రామీణ, ఔత్సాహికుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రాజీవ్ నగర్ భారత్ వికాస్ పరిషత్ భవనంలో ఏసీ, ఫ్రిజ్, వాషింగ్ మెషిన్ మెకానిజంలో నెల రోజుల పాటు ఉచిత శిక్షణ కేంద్రాన్ని నిర్వహించారు. శిక్షణ ముగింపు వేడుకలు బుధవారం జరిగాయి. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ బుడమేరు వరద ముంపుతో సింగ్‌నగర్ పరిసర ప్రాంతాల ప్రజలు ఆర్థికంగా ఎంతో నష్టపోయారని, వారిలోని కొంత మందికైనా ఆర్థిక అభ్యున్నతిని అందించాలనే ఆకాంక్షతో ఈ శిక్షణ కార్యక్రమం చేపట్టినట్లు వివరించారు. శ్రీసత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర సేవాదళ్ కోఆర్డినేటర్ కొమరగిరి శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ ఇక్కడ శిక్షణ తీసుకున్న వారు కొంత కాలం బయట కూడా పనిచేసి మరింత నైపుణ్యం పెంచుకోవాలని సూచించారు. వీరందరిని పుట్టపర్తికి తీసుకువెళ్లి బాబా వారి సన్నిధిలో ఉచితంగా టూల్ కిట్స్‌ను అందజేస్తామని తెలిపారు. రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌చార్జ్ ఓ.నాగప్రసాద్, ఎల్‌జీ కంపెనీ డెప్యూటీ జనరల్ మేనేజర్ ఉపేంద్ర, ఏసీ టెక్నీషియన్స్ జిల్లా అధ్యక్షుడు దివాకర్, బీవీఎస్‌టీ శాయి, ఎస్‌పీఎల్ నరసింహారావు, జిల్లా సేవాదళ్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, సమితి సేవాదళ్ ఇన్‌చార్జ్ తులసీరాం, శేఖర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న నిర్వాహకులు

లింగ సమానత్వంతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యం

మధురానగర్(విజయవాడసెంట్రల్): లింగ సమానత్వంతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమని దళిత స్త్రీ శక్తి రాష్ట్ర కన్వీనర్ జి.ఝాన్సీ అన్నారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం లింగ సమానత్వంపై అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళల హక్కులను ప్రోత్సహించే సామాజిక మార్పును తీసుకురావటానికి విద్య అత్యంత శక్తివంతమైన సాధనం అన్నారు. టీచర్లు విద్యావ్యవస్థకు మూల స్తంభం కాబట్టి పాఠశాల స్థాయి నుంచే మార్పుకు ప్రయత్నించాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ లింగ సమానత్వం అనేది ప్రాథమిక మానవ హక్కు మాత్రమే కాదని, శాంతియుత, సంపన్నమైన, స్థిరమైన ప్రపంచానికి అవసరమైన పునాది అని అన్నారు. కార్యక్రమంలో కళాశాల మహిళా సాధికార కన్వీనర్ కె.అరుణ, డి.రాజ్యలక్ష్మి, ఎన్ఎల్‌జానకి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ భాగ్యలక్ష్మి, వేదికపై దళిత స్త్రీ శక్తి కన్వీనర్ ఝాన్సీ తదితరులు

మొబైల్ సైన్స్ ఎగ్జిబిషన్ ఎంతో ఉపయోగకరం

జిల్లా విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సైన్స్ సబ్జెక్ట్‌పై సరైన అవగాహన ఉంటే ఎన్నో సరికొత్త ఆవిష్కరణలను తయారుచేయవచ్చని, తిరుపతి సైన్స్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మొబైల్ సైన్స్ ఎగ్జిబిషన్ విద్యార్థినీ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉందని జిల్లా విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు అన్నారు. మొబైల్ సైన్స్ ఎగ్జిబిషన్ బస్సు బుధవారం సింగ్‌నగర్ ఎంకే బేగ్ స్కూల్‌కు చేరుకుంది. స్థానిక ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి రిబ్బన్ కట్‌చేసి ఆయన ఈ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. నిర్వాహకులతో మాట్లాడి ఎగ్జిబిషన్‌లో అందుబాటులో ఉంచిన మోడల్స్ గురించి తెలుసుకొని వాటిని విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సైన్స్‌పై ఆసక్తి పెంచేందుకు చేపట్టిన ఈ మొబైల్ సైన్స్ ఎగ్జిబిషన్‌లో అనేక సైన్స్ అంశాలను పొందుపరిచారని, ప్రధానంగా ఇందులో పొందుపరిచిన 20 ఎక్సలెంట్ మోడల్స్ గురించి ప్రతి విద్యార్థి కచ్చితంగా తెలుసుకోవాలని సూచించారు. సింగ్‌నగర్, పాయకాపురం పరిసర ప్రాంతాల్లోని విద్యార్థుల ఉపయోగం కోసం దీనిని ఏర్పాటుచేశామన్నారు. బెంగళూరు మ్యూజియం, తిరుపతి సైన్స్ సెంటర్ వారు కలసి ఈ ప్రోగ్రాంను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. ఏపీసీ ఉమామహేశ్వరరావు, పాఠశాల హెచ్‌ఎం పరసా వెంకటేశ్వరరావు, జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ మైనం హుస్సేన్, సైన్స్ టీచర్లు మనోహర్, ప్రశాంతి, కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.